ప్రజాశక్తి
సోమవారం 15 డిసెంబర్ 2025
5
విజయనగరం



ప్రేమ్‌చంద్‌కు బంగారు పతకం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్



దుబాయ్ వేదికగా జరుగుతున్న యూత్ ఏషియన్ పారా గేమ్స్ -2025లో పారా బాడ్మింటన్ క్రీడాకారుడు పొట్నూరు ప్రేమ్‌చంద్ బంగారు పతకం సాధించాడు. దీంతో ప్రేమ్‌చంద్‌ను కలెక్టర్ రామసుందరరెడ్డి, జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో దేశానికి మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు. ప్రేమ్‌చంద్ విజయం పట్ల పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ హర్షం వ్యక్తం చేశారు.

అగ్రహారం రైతుకు అన్యాయం

- దశాబ్దాలుగా పరిష్కారానికి నోచని సమస్య
- ఏడాదిన్నర కావస్తున్నా పట్టించుకోని ఎమ్మెల్యే
- ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల నిలదీత
- ఆందోళనలో రైతులు



రైతుల సాగులో ఉన్న అగ్రహారం భూములు

ప్రజాశక్తి - జామి

జామి అగ్రహారం రైతులకు న్యాయం జరిగేదెప్పుడు? అన్న ప్రశ్నకు సమాధానం కరువవుతోంది. ఎన్నికల్లో టిడిపి కూటమి అభ్యర్థులను గెలిపిస్తే, అగ్రహార భూముల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రతి సమావేశంలోనూ ఊదరగొట్టిన విషయం తెలిసిందే. కానీ గెలిచి ఏడాదిన్నర కావస్తున్నా... అగ్రహారం భూముల పరిష్కారంపై ఒక్క మాట అడిగిన పాపాన పోలేదు. పోనీ టిడిపి గ్రామ పెద్దలైనా పట్టించుకుంటారంటే, లేదనే బదులు వినిపిస్తోంది. ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. మొత్తానికి దశాబ్దాల అగ్రహారం సమస్య ఒట్టి నీటి మూటగానే మిగిలిపోయిందని చెప్పాలి.

జామి మండల కేంద్రంలో 2,549 ఎకరాల అగ్రహార భూములు ఉన్నాయి. ఈ అగ్రహార భూముల సమస్య.. తాతల తండ్రుల కాలం నుంచి రైతులను ముప్పు తిప్పలు పెడుతున్న విషయం తెలిసిందే. కళ్ల ముందు భూములు ఉన్నా.. ఎటువంటి హక్కులూ లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పాలకులు మారుతున్నారు తప్ప అగ్రహార భూముల సమస్య మాత్రం నెరవేరడం లేదు. ఈ నేపథ్యంలోనే 2023 మే 25న 2050 ఎకరాలకు అప్పటి తహశీల్దార్ పబ్లిక్ నోటిఫికేషన్ వేసి అన్నదాతల్లో ఆశలు రేపారు. దాదాపు మరో 500 ఎకరాలను పెండింగ్‌లో ఉంచారు. తాత ముత్తాతల కాలం నుంచి సాగు చేస్తున్న భూములను ఇనాం వాటా కింద 1/3 షేర్ కేటాయించిన అధికారులపై రైతులు మండిపడినప్పటికీ అప్పటికైనా భూసమస్య పరిష్కారానికి నోచుకుంటుందని అనుకున్నారు. ఈ ప్రక్రియ జరిగి సుమారుగా రెండున్నరేళ్ల పైన కావస్తున్నా... అగ్రహారంపై ఎటువంటి అడుగులూ ముందుకు పడలేదు. ఎన్నికల ప్రచారంలో సమస్యను పరిష్కరిస్తానని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హామీ ఇచ్చినప్పటికీ, ఇంత వరకు దానిపై ఒక్క సారైనా స్పందించలేదని జామి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంత మంది పాలకులు మారినా సమస్య పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు.

రెవెన్యూ సదస్సుల్లో పది మంది రైతులు ఫిర్యాదు చేశారు. జామి ఎంపిటిసి-2 వరలక్ష్మి, వైసిపి నాయకులు కొత్తలి కన్నం నాయుడు అధికారులకు ఫిర్యాదులు అందించారు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రతిపక్ష పార్టీ సభ్యులు పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ రెవెన్యూ అధికారులు మాత్రం స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి కోతలు పూర్తయిన నేపథ్యంలో ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, అగ్రహారం భూ సమస్య పరిష్కారానికి చొరవ చూపుతారని ఆశిస్తున్నారు.

అగ్రహారం భూ సమస్య పై చిత్తశుద్ధి లేదు



రాజకీయ నాయకులకు, అధికార యంత్రాంగానికి చిత్తశుద్ధి లేకపోవడం వల్లే జామి అగ్రహారం భూ సమస్య తాతల తండ్రుల నుంచి పరిష్కారానికి నోచుకోలేదు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి అగ్రహారం రైతాంగ సమస్యపై దృష్టి పెట్టాలి. 2549 ఎకరాల భూ సమస్య పరిష్కరిస్తే, వేలాది రైతులకు మేలు జరుగుతుంది. కాబట్టి ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించాలి.

- తమ్మినేని సూర్యానారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి

80 ప్రాంతాలు 400 మంది పోలీసులు

నగరంలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్



వాహనదారులతో మాట్లాడుతున్న వన్‌టౌన్ సిఐ చౌదరి

ఎస్‌పి ఎఆర్ దామోదర్ ఆదేశాలతో నగరంలో 80 ప్రాంతాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది ఆదివారం సాయంత్రం ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టారు. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు డిఎస్‌పిల ఆధ్వర్యాన సుమారు 400 మంది పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. రహదారి భద్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, నిబంధనలకు విరుద్ధంగా, వాహన పత్రాలు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేయడంతోపాటు హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ తెలిపారు.

ఈ తనిఖీల్లో నలుగురు డిఎస్‌పిలు, 12 మంది సిఐలు, 33 మంది ఎస్ఐలతో సహా సుమారు 350 మంది సిబ్బందిని వినియోగించామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన సుమారు 50మందికి జైలుశిక్ష విధించే విధంగా చర్యలు చేపట్టామన్నారు.

నేడు కానిస్టేబుల్ అభ్యర్థులు హాజరుకావాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కొత్తగా కానిస్టేబుళ్లుగా ఎంపికైన పురుష, మహిళా అభ్యర్థులు సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకోవాలని ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థితోపాటు మరొక ఇద్దరు (వారి తల్లితండ్రులు లేక వారి దగ్గర బంధువులైన అక్క, అన్న లాంటి వారు) మొత్తం ముగ్గురు హాజరుకావాలని సూచించారు. హాజరైన అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులకు పోలీసు వారే టిఫిన్, భోజనాలు ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఇక్కడ నుండి వారిని సురక్షితంగా విజయవాడ తీసుకువెళ్తామని చెప్పారు.

16న సిఎం చంద్రబాబునాయుడు.. మంగళగిరి బెటాలియన్‌లోని పరేడ్ మైదానంలో కానిస్టేబుల్ అభ్యర్థులతో ముఖాముఖి నిర్వహించి వారికి దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. అనంతరం అక్కడే అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తారని వివరించారు. ఈ నెల 22 నుంచి శిక్షణ ప్రారంభం కానుందని, వారికి కేటాయించిన పిటిసి, డిటిసిలలో అభ్యర్థులు ఈ నెల 21న రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

జెఎన్‌టియులో ముగిసిన హ్యాక్‌థాన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు-జివి, జెన్ ఎఐ వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జెన్ ఎఐ హ్యాక్‌థాన్ ఫర్ నెక్స్ట్ జనరేషన్ జాబ్స్ అనే సాంకేతిక కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ సీనియర్ ప్రిన్సిపల్ ఇంజినీరింగ్ మేనేజర్ నరసింహ కారుమంచి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సును ఉపయోగించి వివిధ రకాల సాంకేతికతలను నేర్చుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. వాటిని సక్రమంగా ఉపయోగిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అనంతరం విప్రత సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు డాక్టర్ హను యెడ్లూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఇటువంటి కార్యక్రమాల కారణంగా ప్రతి ఇంటినుంచి ఒక పారిశ్రామిక వేత్త ఉద్భవించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఒడి ఎఐఒ సాజి వి.ఎఫ్, జెఎన్‌టియు జివి రిజిస్ట్రార్ జయసుమ, ప్రిన్సిపల్ ఆర్.రాజేశ్వర రావు మాట్లాడారు. కార్యక్రమానికి సమన్వయకర్తలుగా జి.జె.నాగరాజు, ఆర్.డి.డి.వి.శివరామ్ వ్యవహరించారు. కార్యక్రమంలో బృందాల వారీ పోటీలు నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందించారు.



అతిథికి జ్ఞాపికను అందజేస్తున్న రిజిస్ట్రార్ జయసుమ, తదితరులు



బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వెటరన్స్ బాడ్మింటన్ పోటీలు ఆదివారం స్థానిక ఇండోర్ స్టేడియంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పోటీలను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారుగా 100 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వెటరన్స్ ఇంతమంది ఆడటం వల్ల యువతకు కూడా స్ఫూర్తిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్, అసోసియేషన్ నాయకులు డాక్టర్ విఎస్ ప్రసాద్, కుసుంబచన్, కార్యదర్శి నున్నా సురేష్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు మహేశ్వరరావు, రామారావు

విజయనగరంటౌన్ : ఈ నెల 16 నుంచి గుజరాత్‌లో జరిగే ఆలిండియా సివిల్ సర్వీసెస్ లాన్ టెన్నిస్ పోటీలకు జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు టి.రామారావు, బి.మహేశ్వరరావు ఎంపికయ్యారు. రామారావు ప్రస్తుతం అయ్యన్నపేట ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జిటిగా, మహేశ్వర రావు అలుగోలు హైస్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

నేడు ప్రజా చైతన్య ర్యాలీ

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మజ్జి శ్రీనివాసరావు, కోలగట్ల వీరభద్రస్వామి

నగరంలో సోమవారం చేపట్టిన ప్రజా చైతన్య ర్యాలీని విజయవంతం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టే ర్యాలీకి సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎంఆర్ జంక్షన్ వద్దనున్న మాజీ సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జిల్లాలోని 7 నియోజకవర్గాల నుంచి సేకరించిన సంతకాల ప్రతులతో ప్రజా చైతన్య ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే సుమారు 4 లక్షల సంతకాల ప్రతులను వైసిపి జిల్లా కార్యాలయంలో భద్రపరిచామని తెలిపారు. బాధ్యత గల ప్రతిపక్షంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోలించేలా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు. సోమవారం నిర్వహించే ర్యాలీలో శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శులు వర్రి నర్సింహమూర్తి, సంగంరెడ్డి బంగారునాయుడు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పీరుబండి జైహిందకుమార్, నగర అధ్యక్షులు ఆశపు వేణు, ప్రధాన కార్యదర్శి బోడసింగి ఈశ్వరరావు, కార్పొరేటర్లు బండారు ఆనంద్, బోనెల ధనలక్ష్మి, పట్నాన పైడిరాజు, పార్టీ నాయకులు పిన్నింటి సూర్యనారాయణ, భోగాపురపు రవిచంద్ర, కాళ్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీమా రంగంలో ఎఫ్‌డిఐ పెంపు దారుణం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర మంత్రివర్గం బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని వంద శాతానికి పెంచడం, బీమా చట్టాల సవరణ బిల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం దారుణమని ఐసిఇయు కార్యదర్శి ఎం.వి.శరత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం బీమా రంగంలో ఉపయోగిస్తున్న మొత్తం మూలధనంలో విదేశీ పెట్టుబడుల వాటా కేవలం సుమారు 32 శాతమేనని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎఫ్‌డిఐ పరిమితిని 100 శాతానికి పెంచడం, విదేశీ మూలధనానికి పూర్తిస్థాయి స్వేచ్ఛ ఇవ్వడం పూర్తిగా అవివేకమైన చర్యని అభిప్రాయ పడ్డారు. ఈ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థకు మాత్రమే కాకుండా, దేశీయ బీమా సంస్థలకు కూడా తీవ్రమైన దుష్పరిణామాలను తీసుకువస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. సమాజంలోని బలహీన వర్గాల ప్రయోజనాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. దేశీయ పొదుపులకు విదేశీ మూలధనం ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదని తేల్చిచెప్పారు. బీమా రంగంలో ఎఫ్‌డిఐ పరిమితిని పెంచే నిర్ణయానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ వివరాలతోపాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని చెప్పారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కి మెసేజ్ వస్తుందని చెప్పారు. మండలాలు, మున్సిపాలిటీల్లో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని,జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పదవికే వన్నె తెచ్చిన అశోక్

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతిరాజు పదవికే వన్నె తెచ్చారని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. ఆదివారం క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో అశోక్‌కు ఆత్మీయ సత్కార సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ అశోక్ గజపతి రాజు తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో విలువలకు, విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచారని కొనియాడారు. గోవా గవర్నర్‌గా ఆయన ఎంపిక కావడం తెలుగు వారందరికీ గర్వకారణమని అన్నారు. పదవి ఆయనకు అలంకారం కాదని, ఆయనే ఆ పదవికి అలంకారమని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో క్షత్రియ పరిషత్ ప్రతినిధులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



అశోక్‌గజపతిరాజుకు జ్ఞాపికను అందిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

మంచి వక్తలను తయారుచేయాలి

జెవివి వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమాజంలో జరుగుతున్న తప్పులను ప్రశ్నించాలంటే మంచి వక్తలను తయారు చేయాల్సిన బాధ్యత జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలపై ఉందని ఆ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి తెలిపారు. కంటోన్మెంట్‌లోని గురజాడ పాఠశాలలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మంచి వక్తలను తయారు చేయగలిగితే చైతన్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. సమిష్టి పోరాటాల ద్వారానే ఏదైనా సాధ్యపడుతుందని పంజాబ్, హర్యానా రైతులు నిరూపించారన్నారు. సమాజంలో జరుగుతున్న అంధవిశ్వాసాలను ప్రశ్నించాల్సిన బాధ్యత జెవివి కార్యకర్తలపై ఉందన్నారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెవివి జాతీయ నాయకులు ఎంవిఆర్ కృష్ణాజి, రాష్ట్ర కోశాధికారి పైల రమేష్ రాజు, జిల్లా అధ్యక్షులు ఎరుకొండ ఆనంద్, గంధ్రేటి లక్ష్మణరావు, గంధ్రేటి అప్పలనాయుడు పాల్గొన్నారు.

టెట్ మినహాయింపునకు కృషి

ఎమ్మెల్సీ చిరంజీవిరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు సాధించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు హామీనిచ్చారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా కె.జోగారావు, బి.గోవిందనాయుడు ఎన్నికయ్యారు.

27న ఎపిఎన్‌జిజిఒ నగర ఎన్నికలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ అండ్ గెజిటెడ్ అధికారుల సంఘం నగర శాఖ ఎన్నికలు ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి ఎస్.వి సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సహాయ ఎన్నికల అధికారిగా కె.వి ప్రసాదరావు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఎపిఎన్‌జిఒ హోంలో జరిగే ఈ ఎన్నికలకు పరిశీలకులుగా జిల్లా సహాధ్యక్షులు జి.వి.ఆర్.ఎస్ కిశోర్ వ్యవహరిస్తారని తెలిపారు. విజయనగరం అర్బన్, విజయనగరం, గంట్యాడ మండలాల్లోని గెజిటెడ్, నాన్ గెజిటెడ్ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

త్రోబాల్ విజేతగా విజయనగరం జట్టు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యా శాఖ ఆధ్వర్యంలో విజయనగరం డివిజన్ స్థాయిలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో మహిళా విభాగంలో త్రోబాల్ విజేతగా విజయనగరం జట్టు నిలిచింది. ఫైనల్‌లో వేపాడ మండలంతో జరిగిన పోటీల్లో విజయనగరం విజేతగా నిలిచింది. జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించింది. పురుషుల క్రికెట్ పోటీల్లో ఆదివారం లీగ్ దశలో మ్యాచులు ముగిశాయి. సోమవారం సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. రెండు రోజుల పాటు జరిగిన పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉపాధ్యాయులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు.


యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యుటిఎఫ్ విజయనగరం మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బి.శ్రావణ్‌కుమార్, బి.గణేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక సంస్కృత పాఠశాలలో మండల మహాసభ జరిగింది. ఈ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎం.దక్షిణామూర్తి, సహాధ్యక్షులుగా మాధవీలత, బంగార్రాజు, కోశాధికారిగా వి.హరికుమార్ ఎన్నికయ్యారు. మహాసభలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐదు మత్స్యకార సొసైటీలకు ఆర్థిక సాయం

- 175 మందికి ఇంజిన్లు, బోట్లు, వలలు మంజూరు
- బర్రిపేటలో బహుళ ప్రయోజన భవనం
- సముద్ర జలాల్లో ఐదు చోట్ల కృత్రిమ ఆవాసాలు
- 'ప్రజాశక్తి'తో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయకృష్ణ ముఖాముఖి




ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఐదు మత్స్యకార సొసైటీలకు సుమారు రూ.12.7 లక్షలు అందజేసినట్టు మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.విజయకృష్ణ తెలిపారు. అర్హత గల మత్స్యకారులకు బోట్లు, ఇంజిన్లు, వలలు విరివిగా మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. పతివాడ బర్రిపేటలో రూ.13.7 లక్షలతో బహుళ ప్రయోజనాల భవనం నిర్మిస్తున్నామన్నారు. సముద్ర జలాల్లో ఐదు చోట్ల చేపల కృత్రిమ ఆవాసాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఇంకా మత్స్యకారుల కోసం ప్రభుత్వం అనేక సౌకర్యాలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి మత్స్యశాఖ డిడి ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...

మత్స్య సొసైటీల ఆర్థిక సాయానికి అర్హతలేమిటి.?

ప్రస్తుతం ఎఫ్ఎఫ్‌పిఒ (ఫిష్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్)లకు కేంద్ర ప్రభుత్వం నుంచి మత్స్యశాఖ ద్వారా ఆర్థిక సాయం అందుతోంది. ఇందులో భాగంగా మన ఐదు మత్స్యకార సొసైటీలకు రూ.2.54 లక్షలు చొప్పున ఆర్థిక సహకారం అందిస్తున్నాం. జిల్లాలో చాలా వరకు సొసైటీలు ఉన్నప్పటికీ 100 మందికి పైగా సభ్యులు, రూ.50 లక్షలకు పైగా లావాదేవీలు, అందుకు తగ్గట్టు రికార్డుల నిర్వహణ ఉన్న సొసైటీలు మాత్రమే ప్రస్తుతం అందజేస్తున్న ఆర్థిక సాయానికి అర్హత పొందుతాయి. ఆ విధమైనవి జిల్లాలో ఐదు మాత్రమే ఉన్నాయి.



బోట్లు, వలలకు సబ్సిడీ ఉంటుందా.?

ఔను! యూనిట్ విలువను బట్టి సబ్సిడీ ఉంటుంది. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా మత్స్యకారులకు బోట్లు, ఇంజిన్లు, వలలు అందజేయడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. బోటు విలువ రూ.2.5 లక్షలు, ఇంజిన్ రూ.83 వేలు వరకు ఉంటుంది. వలలు లబ్ధిదారుడు ఎంచుకున్న సైజును బట్టి ధర ఉంటుంది. మొత్తం ఇవన్నీ కలిపి కావాలనుకుంటే రూ.5లక్షల వరకూ పొందవచ్చు. మొత్తం 175 మందికి పైన పేర్కొన్న మూడు, లేదా వాటిలో వారికి కావాల్సినవి మంజూరు చేశాం. లబ్ధిదారుని వాటా ముందుగా చెల్లిస్తే మిగిలిన అమౌంట్ వారి ఖాతాల్లో జమ అవుతుంది.

బహుళ ప్రయోజన భవనం లక్ష్యం ఏమిటి.?

ఇది పూర్తిగా మత్స్యకారులందరి ప్రయోజనాలు దృష్టిపెట్టుకుని నిర్మిస్తున్న భవనం. కాబట్టి మత్స్యకారులు తమ వలలు, ఇతర సామగ్రి భద్రపర్చుకోవచ్చు. లేదా తుపాను సమయాల్లో పునరావాస కేంద్రంగా భావించవచ్చు. అందుకే దీన్ని క్లైమెట్ రిలీజియన్ ఫిషర్‌మెన్ కోస్టల్ విలేజ్ భావిస్తాం. ఇందుకోసం రూ.2 కోట్లు మంజూరైంది. పూసపాటిరేగ తీరంలోని బర్రిపేటలో రూ.13.7 లక్షలతో నిర్మాణం జరుగుతోంది. మిగిలిన మొత్తంతో చేపలు ఎండబెట్టుకునేందుకు అవసరమైన ప్లాట్‌ఫారాల నిర్మాణం చేపడుతున్నాం. 120 మంది మత్స్యకారులకు జిపిఎస్, లైఫ్ జాకెట్లు కూడా కొనుగోలు చేస్తాం.

చేపల కృత్రిమ ఆవాసాలు అంటే ఏమిటి.?

సహజంగా సముద్ర మత్స్యకారులు చేపల కోసం చాలా దూరం వెళ్తుంటారు. ఒక్కోసారి మత్స్య సంపద చేతికి అందక నిరాశతో వెనుదిరగాల్సిన దుస్థితి కూడా ఎదురౌతుంది. ముఖ్యంగా వేట నిషేధ సమయంలో జీవనం కూడా చాలా కష్టతరంగా మారుతుంది. ఈ నేపథ్యంలో తీరానికి సమీపంలోనే వివిధ ఆకారాల్లో తయారుచేసిన సిమెంట్ బ్లాకులు పెడతాం. అందులో చేపల సంతానోత్పత్తి, లేదా జీవించేందుకు అవకాశం ఉంటుంది. వీటినే చేపల కృత్రిమ ఆవాసాలుగా పేర్కొంటాం.

జిల్లాలో కృత్రిమ ఆవాసాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారు.?

జిల్లాలో రెండు మండలాల్లో సముద్ర తీరం విస్తరించి ఉంది. ఈ నేపథ్యంలో ఐదు చోట్ల కృత్రిమ ఆవాసాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. తమ్మయ్యపాలెం సమీపంలో 2, చింతపల్లి బర్రిపేట సమీపంలో 2, తిప్పలవలస సమీపంలో ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి ఆవాసంలోనూ కనీసం 200 సిమెంట్ బ్లాకులు ఉంటాయి. వీటిని ఇప్పటికే కొనుగోలు చేసి, సముద్ర జలాల్లోకి తీసుకెళ్తున్నాం.



గెలుపొందిన మెరకముడిదాం జట్టు

టీచర్స్ క్రికెట్‌లో మెరకముడిదాం విజేత

ప్రజాశక్తి - మెరకముడిదాం

టీచర్స్ క్రికెట్ పోటీల్లో మెరకముడిదాం మండలం జట్టు చీపురుపల్లి జట్టు పై విజయం సాధించింది. ఆదివారం గరివిడిలో డివిజన్ స్థాయి లెదర్ (కుట్టు) బాల్‌తో జరిగిన ఉపాధ్యాయుల క్రికెట్ పోటీల్లో మెరకముడిదాం టీమ్ చీపురుపల్లి టీమ్‌పై 110 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న మెరకముడిదాం జట్టు నిర్ణీత 15 ఓవర్లకు 217 పరుగులు సాధించింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చీపురుపల్లి జట్టు 8 వికెట్ల కోల్పోయి 15 ఓవర్లలో 107 పరుగులు చేయగలిగింది. దీంతో మెరకముడిదాం జట్టు 110 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. గోపన్నవలస హై స్కూలులో సోషల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉపాధ్యాయుడు బూరి తవిటినాయుడు 14 సిక్స్‌లు 4 ఫోర్లుతో 116 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచి టీమ్ గెలుపునకు పునాది వేశారు. తవిటి నాయుడు మాస్టారును ఉపాధ్యాయ బృందం అభినందించింది.

కనకమహాలక్ష్మిని దర్శించుకున్న జిల్లా జడ్జి

ప్రజాశక్తి - చీపురుపల్లి

చీపురుపల్లిలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారిని విజయనగరం జిల్లా జడ్జి జి.షణ్ముఖరావు ఆదివారం కుటుంబంతో సహ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ పాలకవర్గం నుంచి కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, కమిటీ సభ్యులు కనకరత్నం జిల్లా జడ్జి కుటుంబానికి ఘన స్వాగతం పలికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సాలువతో సన్మానించి కనకమహాలక్ష్మి అమ్మవారి చిత్రపటాన్ని బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అమరవీరుని విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - మెరకముడిదాం

మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బంధాపు ఈశ్వరప్రసాద్ ఇటీవల దేశసేవలో అమరులయ్యారు. ఆయన త్యాగానికి చిహ్నంగా, స్వతంత్ర భారతవాణి గుర్తుగా అమరవీరుడు ఈశ్వరప్రసాద్ విగ్రహాన్ని ఆదివారం గ్రామంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ విగ్రహాన్ని అమరవీరుడు ఈశ్వరప్రసాద్ బంధువులు స్వయంగా ఏర్పాటు చేయడం విశేషం. విగ్రహ ఏర్పాటు కోసం ఆ గ్రామానికి చెందిన పేరిచర్ల శ్రీనివాసరావు (శ్రీనుబాబు) స్వచ్ఛందంగా స్థలాన్ని దానం చేశారు. ఆర్మీ జవాన్ త్యాగం, ధైర్యసాహసాలు రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలవాలనే ఉద్దేశంతో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు బంధువులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అమరవీరుడు ఈశ్వరప్రసాద్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అమరవీరుడికి ఘనంగా నివాళులు అర్పించారు.



స్టీల్ ఎక్స్ఛేంజ్ పరిశ్రమను సందర్శించిన విద్యార్థులు

విద్యార్థినుల పారిశ్రామిక పర్యటన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాల విద్యార్థినిలు నాంది ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో నిర్వహించిన విజ్ఞాన పర్యటనలో భాగంగా పారిశ్రామిక పరిజ్ఞానాన్ని పెంపొందించుటకు ఎక్స్‌ప్లోర్ విజిట్‌ను శనివారం నిర్వహించామని పాఠశాల ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు తెలిపారు. ఇందులో భాగంగా 7,8,9వ తరగతి విద్యార్థినులు, నాంది ఫౌండేషన్ ట్రైనర్స్ జామి దివ్య, యడ్ల పూర్ణ, ఉపాధ్యాయులు ఎల్‌కోట మండలంలోని గోల్డ్ స్టార్ దగ్గర ఉన్న స్టీల్ ఎక్స్‌చేంజ్ ఇండియా లిమిటెడ్ కంపెనీను సందర్శించామన్నారు. అక్కడ పనిచేస్తున్న షిఫ్ట్ ఇంజనీర్లు వెంకట్రావు, కనకరాజు సేఫ్టీ ఇంచార్జ్ ఆఫీసర్ రాహుల్ విద్యుత్ తయారీ, ఐరన్ తయారీ విధానాలను వాటి నిర్వహణ అంశాలను విద్యార్థినులకు వివరించారు. అవి ఏపీ ప్రాంతాల్లో తయారు అవుతాయన్న వివరాలను తెలియజేశారు. ఈ పారిశ్రామిక రంగంపై విలువైన జ్ఞానాన్ని అందించిన ఇంజనీర్లకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజిట్ ద్వారా విద్యార్థినిలు పారిశ్రామిక రంగంపై అవగాహన సంపాదించినట్లు ప్రిన్సిపల్ చెప్పారు.

ర్యాలీ విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - వేపాడ

విజయనగరం జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న కోటి సంతకాల ర్యాలీని విజయవంతం చేయాలని మండల వైసిపి అధ్యక్షులు ఎం.జగ్గుబాబు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటు పరం చేస్తామన్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ ర్యాలీ చేపడుతున్నామన్నారు. విజయనగరం సిఎంఆర్ జంక్షన్ నుండి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు కోటి సంతకాల సేకరణ ర్యాలీ నిర్వహిస్తామని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భోగాపురం: ప్రైవేట్ భాగస్వామ్యం లేకుండా రాష్ట్రంలో వైద్య కళాశాలలను పూర్తిగా ప్రభుత్వమే నిర్వహించాలన్న డిమాండ్‌తో వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయిందని ఆ పార్టీ మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయ రెడ్డి అన్నారు. సేకరించిన సంతకాల ప్రతులను కేంద్ర పార్టీ కార్యాలయానికి తరలించేందుకు విజయనగరంలో సోమవారం ఉదయం 10 గంటలకు భారీ ర్యాలీ నిర్వహిస్తామని అందురూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అందరూ అక్కివరం జంక్షన్ వద్దకు ఉదయం 8గంటలకు చేరుకోవాలని సూచించారు.

స్క్రబ్‌టైఫస్‌పై అప్రమత్తం

ప్రజాశక్తి - చీపురుపల్లి

స్క్రబ్ టైఫస్ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణానికి చెందిన సత్యరామా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆదివారం రాయవలసలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు ఉపాధ్యాయులు గ్రామం మొత్తం ర్యాలీగా తిరిగి పరిసరాల పరిశుభ్రత పట్ల నినాదాలు చేసి ప్రజల్లో అవగాహన కల్పించారు. తడి చెత్త పొడి చెత్త నిల్వలను వేరుచేసి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధులకు దూరంగా ఉండాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రత తో వ్యాధులు దరిచేరకుండా ఉంటాయని ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కాలుష్య నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, వ్యక్తి గత మరుగుదొడ్ల వినియోగం వల్ల గ్రామ పరిసరాలు మెరుగుపడతాయని అన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ టి.ముకుందరావు, స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ మీసాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమావేశం

ప్రజాశక్తి - భోగాపురం

ఎయిర్‌పోర్ట్ పరిధిలోని మాజీ సైనికుల సంక్షేమ సేవా సంఘం సమావేశం ఆదివారం భోగాపురంలోని వారి తాత్కాలిక కార్యాలయంలో నిర్వహించారు. మాజీ సైనికులు, వితంతువులు, పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రయోజనాలపై అవగాహన కల్పించడంతో పాటు, సంఘం చేపట్టబోయే భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ మండలాలలోని ప్రజలకు ప్రకృతి విపత్తుల సమయంలో రక్షణ కల్పించేందుకు ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి సేవలు అందించాలన్న దానిపై నిర్ణయం తీసుకున్నట్లు సంఘ అధ్యక్షుడు సవరం రాంబాబు, కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో మూడు మండలాలకు చెందిన పలువురు మాజీ సైనిక ఉద్యోగులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

కష్టం వస్తే ఎవరికి చెప్పుకోవాలో..?

◆ గురుకులంలో కానరాని హెల్త్ సూపర్‌వైజర్ ◆ అవస్థలు పడుతున్న విద్యార్థినులు ◆ పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - వంగర

మండలంలోని మద్దువలస అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినిల కష్టాలు వర్ణనాతీతం. వారు పడుతున్న ఆరోగ్య కష్టాలను ఎవరితో చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఈ గురుకులంలో విద్యార్థినిలను ఆరోగ్యపరంగా చూసుకోవలసిన హెల్త్ సూపర్‌వైజర్ పోస్ట్ గత ఆరు మాసాలుగా ఖాళీగా ఉండటంతో పలువురు విద్యార్థినిలు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ గురుకులంలో 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు మొత్తం 544 మంది విద్యార్థినిలు చదువుతున్నారు. చిరంతా ఆడపిల్లలు కావడంతో నెలవారీ వచ్చే సమస్యలు అధికంగా ఉంటాయి. చదువుతో పాటు ఆరోగ్యం కూడా ప్రధానం. అయినప్పటికీ వారి ఆరోగ్యం మీద దృష్టి పెట్టే నాథుడే కరువయ్యాడు. పాఠశాలలో హెల్త్ సూపర్‌వైజర్ లేకపోవడంతో ఏ ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి చూపించుకోవలసిన పరిస్థితి దాపురించింది. దీంతో సమయం కూడా వృథా అవడంతో పాటు ఇబ్బంది అవుతుందని విద్యార్థినిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గురుకులంలో చదువుకుంటున్న విద్యార్థినిల తల్లిదండ్రులు



వంగర ఆరోగ్య కేంద్రానికి వచ్చి వెళుతున్న గురుకుల విద్యార్థినిలు

కూడా తమ పిల్లలు ఆరోగ్య పరిస్థితిపై సమాచారం కూడా ఉండటం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని హెల్త్ సూపర్‌వైజర్‌ను నియమించాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

లైబ్రరీ, పీడీ పోస్టుల పరిస్థితి ఇదీ

చక్కగా చదువుకోవాలనుకుంటే ఆరోగ్యంగా ఉండాలి. ఆరోగ్యంగా ఉండాలంటే ఆటలు ఎంతో అవసరం. అలాంటిది పీడీ పోస్ట్ ఈ గురుకులంలో గత ఆరు మాసాలుగా ఖాళీగానే ఉంది. దీంతో అక్కడ ఆటలు ఆడించే పరిస్థితి కనిపించడం లేదు. మరి ముఖ్యంగా చదువుకోవడానికి లైబ్రరీ ఎంతో అవసరం అక్కడ లైబ్రరీ ఉన్నప్పటికీ లైబ్రేరియన్ లేకపోవడంతో విద్యార్థినిలు లైబ్రరీకి దూరమవుతున్నారు. ఈ గురుకులంలో ప్రధానమైన హెల్త్ సూపర్‌వైజర్, పీడీ, లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉండటంతో కొన్నాళ్లుగా అక్కడ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. బయటకు చెప్పడానికి కూడా విద్యార్థినిలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీగా ఉన్న ఈ మూడు పోస్టులను భర్తీ చేసి విద్యార్థినిల సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

అధికారులకు తెలియజేశాం

మద్దువలస గురుకులంలో గత ఆరు మాసాలుగా హెల్త్ సూపర్‌వైజర్ లేకపోవడంతో రోజుకో టీచరు విద్యార్థినిల హెల్త్‌కు సంబంధించి పర్యవేక్షిస్తున్నారు. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. హెల్త్ సూపర్‌వైజర్‌ని ఎప్పుడు నియమిస్తారో తెలియదు.

- జంప రాధిక, ప్రిన్సిపాల్, అంబేద్కర్ గురుకులం మద్దువలస.

రేపు ప్రభుత్వ ఐటిఐలో జాబ్ మేళా

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి.ప్రశాంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి కల్పనలో భాగంగా ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బిటెక్, ఎలాంటి పీజీలో ఉత్తీర్ణత సాధించిన 18 నుండి 35 ఏళ్ల మధ్య ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు అర్హులన్నారు. జాబ్ మేళాకు 10 బహుళ జాతి కంపెనీలు హాజరవుతాయని చెప్పారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతి, యువకులు https:// naipunyam.ap.gov.in వెబ్ సైట్లో ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు అడ్మిట్ కార్డుతో పాటుగా రెస్యూమే, ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా జరుగు ప్రదేశంలో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు నెంబర్ 9618792572, టోల్‌ఫ్రీ 9988853335 సంప్రదించాలన్నారు.

చెరువులో ధాన్యం ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి - గజపతినగరం

మండలంలోని పాతబగ్గాం గ్రామానికి చెందిన సంగంరెడ్డి తవుడుకు తన పొలంలో పండిచిన ధాన్యాన్ని ఆదివారం మిల్లర్‌కు తరలిస్తుండగా గ్రామానికి సమీపంలో ఉన్న కోనేరు (చెరువు) వద్దకు వచ్చేసరికి బోల్తా పడింది. రోడ్డు సరిగా లేకపోవడంతో గుంతలో ట్రాక్టర్ టైర్ దిగి ఒక్కసారిగా కోనేటిలోకి ట్రాక్టర్ అమాంతంగా పడిపోయింది. ఈ సమయంలో ట్రాక్టర్‌పై 140 బస్తాలు



చెరువులో బోల్తా పడిన ధాన్యం ట్రాక్టర్

ఉన్నాయి. ఇవి నీటిలో పడిపోవడంతో తడిచి ముద్దాయ్యాయి. రైతు కేకలు వేయడంతో దగ్గరలో ఉన్న రైతులు, స్థానికులు అక్కడకు చేరుకుని చెరువులో పడిపోయిన ట్రాక్టర్‌ను, ధాన్యం బస్తాలను ఒడ్డుకు చేర్చారు. అయితే చెరువులో పడిపోవడంతో ధాన్యం పూర్తిగా దెబ్బతింటాయని రైతు వాపోతున్నాడు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరుతున్నారు.

అధికారుల తీరు మారాలి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ అధికారులు విలువనీయటం లేదని మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిల ఆవేదన చెందడంతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కలుగుజేసుకుని అధికారుల తీరు మార్చుకొని ప్రోటోకాల్ పాటించాలని అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరు కాకపోవడం పై అధ్యక్షులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలస్థాయి అధికారుల స్థానంలో హాజరైన కొంతమంది దిగువ స్థాయి సిబ్బందిని అధ్యక్షులు అనుమతించలేదు. మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశానికి హాజరుకాని అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని అసంపూర్ణంగా ఉన్న అంగన్వాడీ భవనాలను పూర్తిచేసే బిల్లులు విడుదల చేయాలని ఆయా గ్రామాల సర్పంచులు అడుగగా పిఆర్‌జెఇ మాట్లాడుతూ 2014 -19 మధ్య నిర్మించిన భవనాలకు ఇంకా 30శాతం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

బిల్లులు మాత్రమే పెండింగ్ ఉన్నాయని మిగిలిన పనులకు మళ్లీ ప్రొసీడింగ్ ఇవ్వాలని అన్నారు. హౌసింగ్ స్కీంలో ఇల్లు నిర్మాణానికి జాబ్ కార్డులు కంపల్సరీ అయినందున జాబ్ కార్డులు మంజూరు చేయడంలో ఆలస్యం అవుతుందని చామలాపల్లి సర్పంచ్ సూర్యారావు అడుగగా కొత్తగా దరఖాస్తు చేసినవి వెంటనే అవుతున్నాయని గతంలో జాబ్ కార్డు ఉండి ఉపాధి పనికి రానివారు ఇద్దరు, ముగ్గురుకు ఒకే జాబు కార్డు ఉన్నవారు ఆధార్ అప్డేట్ కోసం కొద్దిగా ఆలస్యం అవుతుందని అన్నారు. ధర్మవరం సర్పంచ్ గాలి సన్యాసయ్య మాట్లాడుతూ అధికారులు సర్పంచ్ విధులను అవమానపరుస్తున్నారని ధర్మవరంలో చేసిన ఉపాధి హామీ పాత పనులనే మరల మరలా చూపిస్తూ బిల్లులు చేసుకుంటున్నారని అన్నారు. ఎంపిపి, వైస్ ఎంపిపి మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన నిర్వహించిన ప్రజాదర్బార్లో తహశీల్దార్ ప్రోటోకాల్ పాటించలేదని, ప్రజా ప్రతినిధులకు విలువనీయలేదని, సభా సంప్రదాయాలు పాటించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణాపురం సర్పంచ్ యామినీ దేవి మాట్లాడుతూ అధికారులు విలువనీయడం లేదని అంటున్నారని ఇందులో నాయకులు తప్పేమీ లేదా అని ప్రశ్నించారు. పింఛన్లు పంపిణీలో సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు కాకుండా పదవి లేని వారు పాల్గొంటున్నారని పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి, తహశీల్దార్ శ్రీనివాసరావు, జిఎస్‌డబ్ల్యు డిప్యూటీ ఎంపిడిఒ జె. విష్ణుమూర్తి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, వివిధ శాఖల మండల అధికారులు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి - బొబ్బిలి

అంతర్జాతీయ రోటరీ సంస్థ సభ్యులుగా సమాజానికి అందించన సేవలు గుర్తింపునిస్తాయని రోటరీ జిల్లా అధ్యక్షులు జెసి రాజు అన్నారు. స్థానిక రోటరీ కార్యాలయంలో బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీహరి, కార్యదర్శి శివకాంత్ ఆధ్వర్యంలో క్లబ్ అసెంబ్లీని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ సభ్యులుగా, సమాజానికి సేవలందిస్తూ కళింగ వైశ్య సంఘానికి అధ్యక్షునిగా ఎన్నికైన గెంబలి శ్రీనివాసరావు దంపతులకు, అగ్రహారం వీధి ఆంజనేయ దేవాలయ కమిటీ అధ్యక్షులుగా నియమితులైన కింతలి బంగారాజుకు, రోటరీ సంస్థను బొబ్బిలిలో స్థాపించి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో సంస్థ మొదటి అధ్యక్షులు చంద్ర కిషోర్‌లకు రోటరీ సభ్యులు ఘనంగా సత్కరించారు. జెసి రాజు మాట్లాడుతూ జనవరి నెలలో ఎంతో ప్రతిష్టాత్మకంగా కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్ ఆడిటోరియంలో నిర్వహించబోయే రోటరీ డిస్ట్రిక్ట్ సెమినార్‌కు సభ్యులు హాజరై విజయవంతం చేయాలన్నారు. క్లబ్ అధ్యక్షులు శ్రీహరి మాట్లాడుతూ జనవరి 10వ తేదీన రోటరీ డిస్ట్రిక్ట్ 3020



సమావేశంలో మాట్లాడుతున్న జెసి రాజు

గవర్నర్ డాక్టర్ కల్యాణి చక్రవర్తి బొబ్బిలి సందర్శిస్తారని తెలియజేశారు. బొబ్బిలి బిసి కళాశాల బాలికల వసతి గృహానికి 15 ఫాన్స్, ట్యూబ్ లైట్స్ అందివ్వాలని, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలికలకు 100 పరుపులు సమకూర్చాలని, మహిళల ఉపాధికి 10 హై స్పీడ్ కుట్టు మిషనులు ఇవ్వాలని, ఉచిత వైద్య శిబిరాలు, బ్రెస్ట్ కేన్సర్, సెర్విక్ కేన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించాలని తీర్మానం చేశారు. సమావేశంలో రోటరీ డైరెక్టర్ సింద్రీ శ్రీనివాసరావు, డాక్టర్ దివాకర్‌బాబు, జయప్రకాష్, నాగరాజు, రామకృష్ణ, కృష్ణమోహన్ లక్ష్మీ దీపవల్లి, శంకర రావు, రవి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

యువకులు సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలని, సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని విజయనగరం ఎస్‌విఆర్ డిగ్రీ కళాశాల చైర్మన్ ఎస్ వెంకటరమణ సూచించారు. మండలంలోని రామతీర్థంలో గత వారం రోజులు పాటు జరిగిన కళాశాల ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు సామాజిక ప్రయోజన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామీణ ప్రాంతం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన రామతీర్థంలో వారం రోజులు పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయ



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ వెంకటరమణ

మన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థితికి చేరాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. లోకనాథం, జె.కృష్ణమోహన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అమరావతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

జిందాల్ నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం నాయకులు చల్లా జగన్ డిమాండ్ చేశారు. ఆదివారం బొడ్డవరలో ఆందోళన చేస్తున్న నిర్వాసితులతో ఆయన మాట్లాడుతూ జిందాల్ యాజమాన్యం మొదటి నుండి కుట్రపూరితంగా భూములు లాక్కొని, 18 సంవత్సరాలు భూముల్లో ఎటువంటి పనులూ చేపట్టకుండా ఇప్పుడు ఆ భూములు కోట్లరూపాయలు విలువ చేసేసరికి పారిశ్రామిక రియల్ ఎస్టేట్‌కు తెగబడి అమ్మకానికి సిద్ధపడిందన్నారు. భూములు ఇచ్చిన రైతులు తమ భూముల్లో పరిశ్రమ కడతారని, తమకు, తమ పిల్లలకు ఉద్యోగాలు ఉంటాయని, షేర్లు రూపంలో కంపెనీలో వాటా ఉంటుందని 18 ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని చెప్పారు. నేడు ప్రభుత్వ సహకారంతో



నిరసన తెలుపుతున్న జిందాల్ బాధితులు

ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, నాడు ఇచ్చిన హామీల అమలు చేయవలసి వస్తుందని జీవో నెంబరు 14 తెచ్చి ముందు ఇచ్చిన హామీలుకు చెల్లి చీటి పాడేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని అన్నారు. నాడు తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని 184 రోజులుగా భూములు కోల్పోయిన దళితులు, గిరిజనులు ఆందోళన నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని కె.సీతారాంపురం గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో 12 పూరిళ్లు దగ్ధమవగా పాపాయమ్మ అనే 70 ఏళ్ల వృద్ధురాలు సజీవ దహనమైన సంగతి తెలిసిందే. అగ్ని



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ప్రమాద బాధితులను ఎమ్మెల్యే బేబినాయన ఆదివారం పరామర్శించారు. ప్రతి ఒక్క బాధిత కుటుంబంతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పి, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని, సంబంధిత అధికారులతో మాట్లాడి, వారికి మెరుగైన సదుపాయాలు కల్పించాలని సూచించారు.. అనంతరం బాధిత కుటుంబాలకు బియ్యం, వంటసామన్లు, బట్టలు, దుప్పట్లు, కొంత నగదును సహాయంగా అందించారు. అనంతరం సర్పంచ్ జి. శంకరరావు, ఎంపిటిసి సాకేటి నాగమణి కూడా ఆర్థిఖ సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ గిరడ అప్పలస్వామి, తెర్లాం టిడిపి మండల అధ్యక్షులు నర్సుపల్లి వెంకటేష్, మద్రాపు శంకర్రావు, రెడ్డి శంకర్రావు, కరణం రమేష్, పిఎసిఎస్ చైర్మన్ జగ్గరాజు, పాల్గొన్నారు.

ఆర్ఎంపిల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - రాజాం

గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపి వైద్యులు అందిస్తున్న సేవలు అభినందనీయమని టిడిపి సీనియర్ నాయకులు కోండ్రు జగదీష్ అన్నారు. పట్టణంలోని ఆర్ఎంపి వైద్యుల ఆత్మీయ సమావేశం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో ఆర్ఎంపి వైద్యుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన భాను యూరోకేర్ హాస్పిటల్ యూరాలజిస్ట్ డాక్టర్ భానుమూర్తి, హారిక డెంటల్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్ ఓరల్ అండ్ మాక్సిలో ఫేషియల్ సర్జన్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు.

ఒకేరోజు ఐదు ఆలయాల్లో చోరీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని భానాదిలో గ్రామంలో శనివారం రాత్రి ఐదు ఆలయాల్లో చోరీలు జరిగాయని ఎస్ఐ సుదర్శన్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. టిడిపి మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు ఫిర్యాదు మేరకు బానాది గ్రామం వెళ్లి పరిశీలించగా గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి గుడి, పరదేశమ్మ గుడి, ఆంజనేయస్వామి గుడి, వినాయక మందిరం, శివాలయం మొదలగు ఆలయాల్లో చోరీ జరిగినట్లు నిర్ధారించాం. ఆలయ కమిటీల నిర్వాహకులు, ఆలయాల అర్చకుడు మేడపాటి కిషోర్ శర్మ తెలిపిన వివరాల ప్రకారం సుమారు రెండు లక్షల వరకు నగదు చోరీ అయి ఉంటుందని అంచనా వేశాం. బానాది గ్రామం నుండి ఆనందపురం, వేపాడ వెళ్లే మార్గాలలో మధ్య ఉన్న సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నాం. ఆలయాల్లో హుండీలలో నగదును మాత్రమే దొంగాలించారు. బంగారు ఆభరణాలు, వెండి వస్తువుల జోలికి వెళ్లకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు గొంప



బయట ఉన్న హుండీలను పరిశీలిస్తున్న ఎస్ఐ

వెంకట్రావు మాట్లాడుతూ సంక్రాంతి తరువాత తీర్థాలను చూసుకొని హుండీలు ఓపెన్ చేద్దామని అనుకున్నామని ఇంతలో ఇలా జరిగిందని అన్నారు. అనంతరం క్లూస్‌టీమ్ గ్రామంలో ఆదారాలు సేకరించింది. ఘటనా స్థలాన్ని రూరల్ సిఐ అప్పలనాయుడు పరిశీలించారు.

లారీ ఢీకొని తండ్రి మృతి

ఇద్దరు పిల్లలు సహా మరో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని ఎస్‌కోట రోడ్‌లో ఫైర్ స్టేషన్ సమీపంలో లారీ బైక్‌ను ఢీ కొట్టడంతో తండ్రి అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరు కుమారులతో సహ చిన్నాన్న తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేపాడ మండలం కుంపల్లి గ్రామానికి చెందిన గొల్ల శంకరరావు తన తమ్ముడు గొల్ల దారప్పడు వారి ఇద్దరు పిల్లలు గొల్ల హరినాద్, గొల్ల భవానీ శంకర్‌తో కలిసి నలుగురూ ద్విచక్ర వాహనంపై ఆదివారం విశాఖపట్నం బీచ్‌కు బయలుదేరారు. తుమ్మికాపల్లి సమీపంలో ఎస్‌కోట రోడ్డును దాటుతుండగా లారీ వేగంగా రావడంతో దాన్ని దాటించారు. ఈ క్రమంలో లారీ వెనుక భాగం ద్విచక్ర వాహనానికి తగిలి నలుగురూ రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో గొల్ల శంకరరావు (50) అక్కడికక్కడే మృతి చెందగా తమ్ముడు దారప్పడు, ఇద్దరు పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. క్షత గాత్రులను సిఐ సిహెచ్ షణ్ముఖరావు మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఘనంగా ముగిసిన రజతోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

మండలంలోని భవానీ నగర్ వద్ద గల శ్రీగౌరీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో మూడు రోజులుగా జరుగుతున్న సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ ఆదివారం ఘనంగా ముగిశాయి. పాఠశాల కరస్పాండెంట్ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు పాల్గొని మాట్లాడారు. ఈ పాఠశాల 25 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఒక పాఠశాల అభివృద్ధి కావాలంటే పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించాలని చదువుతోపాటు యోగా, ఆటలుపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా పిల్లల ప్రదర్శించిన కరాటే విన్యాసాలు, పిరమిడ్స్, కోలాటం, సాంప్రదాయ నృత్యాలు అందర్నీ అలరించాయి. లోక్‌సత్తా అధ్యక్షులు బీశెట్టి బాబ్జి, ఎపి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మెట్ట జనార్ధన్, కార్యదర్శి తమ్మినేని సింహాచలం, జిల్లా అధ్యక్షులు పాపారావు, హెచ్‌ఎం కాండ్రేగుల వెంకట రాము విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

ప్రజాశక్తి - చీపురుపల్లి

చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ కవర్లు గ్లాసులు వాడకాన్ని నిషేధిస్తూ పంచాయతీ కార్యనిర్వహణ అధికారి ఆదేశాలతో ఆదివారం పట్టణంలో పంచాయతీ జూనియర్ అసిస్టెంట్లు ఎన్ రామ్మోహన్‌రావు, ఈశ్వరరావు జోరుగా ప్రచారాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు వినియోగించడం వల్ల కేన్సర్ వ్యాధి ప్రభలే ప్రమాదం ఉందని,



ప్రచారం చేస్తున్న సిబ్బంది

నిర్లక్ష్యంగా వాటిని మురికి కాలువల్లో పడేయడం వల్ల మురికి నీటి నిల్వలు పెరిగి దోమలు అధికం కావడంతో రోగాలు ప్రబలుతున్నాయంటూ ప్రచారాన్ని నిర్వహించారు. పశువులు వాటిని తినడం వల్ల కంఠకోస వ్యాధులకు గురై మృత్యువాత పడుతున్నాయని అన్నారు. పంచాయతీ ఆదేశాల మేరకు 55 మైక్రోల కన్నా తక్కువ గల ప్లాస్టిక్‌ను అమ్మినా, వాడినా, వారిపైన పర్యావరణ పరిరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేసి అపరాధ రుసుమును విధిస్తామని హెచ్చరించారు. ప్రచారం అనంతరం ప్లాస్టిక్ నిల్వల పైన అధికారులు దాడులు నెరవేస్తారని ఈ సందర్భంగా వ్యాపారులకు వినియోగదారులకు హెచ్చరికలు జారీ చేశారు.

రూ.3.61 లక్షల జరిమానా వసూలు

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం, పూసపాటిరేగ మండలాలలో పలు అనధికార మద్యం దుకాణాలపై దాడులు నిర్వహించి, సంబంధిత వారిపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుములు విధించినట్లు ఎక్సైజ్ సిఐ వి.రవికుమార్ ఆదివారం తెలిపారు. 2024 అక్టోబర్ 1 నుంచి 2015 ఆగస్టు 15 వరకు భోగాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో మొత్తం 94 మద్యం కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ కేసులను శనివారం నిర్వహించిన నేషనల్ లోకాదాలత్‌లో పరిష్కరించామని దాని వల్ల మొత్తం రూ.3.61లక్షల అపరాధ రుసుము వసూలు చేసినట్లు తెలిపారు. అనధికార మద్యం విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ప్రజలు ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని ఎక్సైజ్ అధికారులు విజ్ఞప్తి చేశారు.